క్లుప్తంగా

హోంగార్డు పోస్టులకు నేడు రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరిలో ఆదివారం హోంగార్డు పోస్టులకు జరగనున్న రాతపరీక్షకు యానాం నుంచి 332 మంది అభ్యర్థులు తరలి వెళ్లారు. పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో 3,034 మంది పురుషులు, 1,195 మంది మహిళా అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పుదుచ్చేరివ్యాప్తంగా రాతపరీక్షకు 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. అభ్యర్థులు ఆధార్, ఓటరుకార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పాన్‌కార్డుల్లో ఏదొక గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 0413–2233338 నెంబరులో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు కంచాల బహూకరణ



భీమనపల్లిలో విద్యార్థులకు కంచాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లిలో శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కరాటం జగదీష్ నాయుడు సమకూర్చిన 150 కంచాలను ఉపాధ్యాయుల చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం దాత జగదీష్, నాగలక్ష్మి దంపతులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి, సేవారత్న నేషనల్ అవార్డు గ్రహీత కరాటం ప్రవీణ్, హెచ్ఎం నూకల సత్యనారాయణ, రాయి వెంకటేశ్వరరావు, నడింపల్లి పద్మనాభన్, కామన మధుసూదనరావు పాల్గొన్నారు.

2న సామాజిక తనిఖీ ప్రజా వేదిక

తాళ్లరేవు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రజా వేదిక కార్యక్రమం వచ్చే నెల 2వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ మోహనకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించి 17 గ్రామ పంచాయతీల్లోనూ 17వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించామన్నారు. ఆయా గ్రామ సభల్లో వచ్చిన ఫలితాలను చర్చించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జులై 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది హాజరవుతారన్నారు.

రుణ మంజూరు పత్రాల అందజేత



లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా చేపల వేట చేసే బోటు యజమానులకు కిసాన్ క్రెడిట్ రుణ మంజూరు పత్రాలను ఆర్ఏఓ మునిస్వామి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని సావిత్రినగర్ గ్రామానికి చెందిన కర్రి బూసిరాజు, వనమాడి దేవి, కర్రి ధర్మారావు, సంగాడి మల్లయ్యలకు రూ.1.60 లక్షల విలువైన రుణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు మేనేజర్ టీఎల్ఎన్ కుమార్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు గొంతియ్య పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పింఛన్ అందించాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్

ఉప్పలగుప్తం: 1వ తేదీ సోమవారం ఉదయం లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఉప్పలగుప్తం ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం సచివాలయ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి సూచనలిచ్చారు. మండలంలో 8,004 మంది లబ్ధిదారులకు 136 మంది సచివాలయ సిబ్బంది రూ.5.36 కోట్ల పింఛను నగదు అందజేయనున్నారని ఆయన తెలిపారు. పింఛనుదారులు వారి ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి నగదు స్వీకరించాలని కోరారు.

తాళ్లరేవు: 1వ తేదీన పింఛన్‌దారులకు ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేయనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ మోహనకృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయనున్నామన్నారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారులు 1వ తేదీన సొంత సచివాలయ పరిధిలోనే ఉండి సహకరించాలని కోరారు.

కష్టాలు... కన్నీళ్లు



పోలేకుర్రు పంట కాలువలో అడ్డంగా పడిన వృక్షం



పి.మల్లవరంలో పంట చేలకు గుల్లతో నీటిని తోడుకుంటున్న రైతు

- నీరు వదిలి నెల రోజులైనా తడవని పొలాలు
- ఆదిలోనే పుడమి పుత్రులకు వెతలు
- అధికారుల నిర్లక్ష్యంతో అందని జలాలు

తాళ్లరేవు: ఖరీఫ్ సాగుకు ఆదిలోనే ఆటంకాలు ఎదురయ్యాయి.. పంట కాలువల్లో అడుగడుగునా అడ్డంకులతో సాగునీరు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. కాలువలకు నీటిని విడుదల చేసి నెలరోజులు కావొస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరి చేలు పూర్తి స్థాయిలో తడవడం లేదు. కనీసం వరుణుడైనా కరుణిస్తాడనుకుంటే ముఖం చాటేశాడు. తాళ్లరేవు మండలంలోని ప్రధాన పంట కాలువలో పలుచోట్ల చెట్లు పడిపోయాయి. దీంతో పాటు చెత్తా చెదారం అధికమైంది. దీనివల్ల నీరు ముందుకు కదలడం లేదు. ముఖ్యంగా పోలేకుర్రు–తోటపేట వద్ద రెండు భారీ వృక్షాలు కాలువలో పడిపోయి రోజులు గడుస్తున్నా తొలగించలేదు. ఇలా ఉండగా ఇంజరం వంతెన కల్వర్టు వద్ద భారీగా చెత్త పేరుకుపోవడం, దానిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో కూడా శివారు భూములకు సాగునీటి సమస్య తలెత్తుతోంది. పంట ప్రారంభంలోనే రైతులు గుల్లలు, డీజిల్ ఇంజిన్లను పెట్టి నీరు తోడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు తూతూమంత్రంగానే పనులు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరుణించని వరుణుడు

ఈ ఏడాది వర్షపాతం బాగుంటుందని అధికారులు చెబుతున్నప్పటికీ మృగశిర కార్తె ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ పట్టుమని దుక్కు వర్షం కురవలేదని రైతులు వాపోతున్నారు. నైరుతీ రుతుపవనాలు సైతం అలా మొహం చూపించి వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు ఆశాభంగం తప్పలేదు. చినుకులు తప్ప ఆశించిన స్థాయిలో వర్షం కురవలేదు. సాగునీరు పూర్తి స్థాయిలో అందకపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇలా ఖరీఫ్ పంటకు తీవ్ర ఆలస్యం అవుతోంది.

చమురు సంస్థలతో కష్టాలు



మండలంలోని రిలయన్స్, ఓఎన్జీసీ వంటి చమురు సంస్థలు పంట కాలువల నుంచి సాగునీటిని యథేచ్ఛగా తోడేస్తున్నాయి. దీనివల్ల పంట చేలకు నీరు అందడం లేదు. చమురు సంస్థలకు ధవళేశ్వరం నుంచి నేరుగా పైప్‌లైన్ నిర్మించుకునే స్తోమత ఉన్నా రైతుల సాగునీటిని తరలించుకుపోవడం సరికాదు. ఏటా ఖరీఫ్, రబీలలో సుమారు ఆరు వేల ఎకరాలకు సాగునీటి ఇబ్బంది తలెత్తుతోంది.

– వల్లు రాజబాబు, ఏపీ కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి

దమ్ము చేయడానికీ నీరు లేదు



ఖరీఫ్‌కు గడువు ముంచుకొస్తున్నా పూర్తి స్థాయిలో వర్షాలు పడకపోవడం, కాలువల నుంచి నీరు అందకపోవడంతో కనీసం దమ్ము చేయడానికి కూడా ఇబ్బంది నెలకొంది. దీంతో పంట కాలువల నుంచి గుల్లలు, ఇంజిన్లతో నీటిని తోడుకుని వరినారు వేసుకుంటున్నాం. కనీసం వరినాట్లు వేసుకునే సమయానికైనా పూర్తి స్థాయిలో నీటిని అందించాలి.

– పంపన నూకబాబు, రైతు, పి.మల్లవరం

ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



ప్రతి పంట కాలంలోనూ సాగునీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. కాలువల ఆధునీకరణ చేయకపోవడం, పూడికలు, వ్యర్థాలు తొలగించకపోవడంతో పూర్తి స్థాయిలో నీరు అందడం లేదు. దీంతో సాగునీటి కోసం అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇకనైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– మట్టపర్తి సత్తిబాబు, రైతు, పోలేకుర్రు

ఎన్నికల నిధులు దోచుకున్నారు

ముమ్మిడివరం తహసీల్దార్ శ్రీనునాయక్‌పై కాట్రేనికోన తహసీల్దార్ ప్రశాంతి ఆరోపణ



విలేకర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రశాంతి

కాట్రేనికోన: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ మండలానికి రావాల్సిన ఎన్నికల ట్రావెలింగ్ ఎలవెన్స్ నిధులను కొంతమంది అధికారులు దోచుకున్నారంటూ కాట్రేనికోన తహసీల్దార్ డి.ప్రశాంతి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె అత్యవసరంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రశాంతి మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గానికి వచ్చిన రూ.1.40 కోట్ల రూపాయలను ముమ్మిడివరం ఎమ్మార్వో శ్రీను నాయక్ మాయం చేశారన్నారు. కాట్రేనికోన మండలానికి రూ.12 లక్షలు ఖర్చయిందని, ఇప్పుడు ఆ సొమ్ము ఎక్కడి నుంచి తెచ్చి ఇచ్చేదని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

బిల్లులు చెల్లించేశాం

ఎన్నికల ట్రావెలింగ్ ఎలవెన్స్ నిధుల విషయంపై ముమ్మిడివరం తహసీల్దార్ శ్రీనునాయక్‌ను 'సాక్షి' వివరణ కోరగా కాట్రేనికోన ఎమ్మార్వో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికల నిధులు వచ్చిన మేరకు ఆయా మండలాల అధికారులకు చెల్లించేశామన్నారు. ఇంకా రావాల్సిన నిధులున్నాయని, అవి వచ్చాక మిగిలిన బిల్లులు చెల్లిస్తామన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



డయేరియాపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఏ ఒక్కరూ డయేరియాతో మరణించకూడదని, వాతావరణంలో మార్పుల దృష్ట్యా డయేరియాపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన వైద్య సిబ్బంది, ఐసీడీఎస్, వివిధ శాఖల అధికారులకు డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సుమ, శాంతిప్రియ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల డయేరియాని నియంత్రించవచ్చని సూచించారు. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకూ డయేరియాపై అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ టాబ్లెట్లు ఇవ్వాలని సూచించారు. రోటావాక్, ఎమ్మార్ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా పిల్లలకు ఇప్పించాలని, వందశాతం వ్యాక్సిన్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రసాద్, సుధాకర్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా

కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, సభ్యులు

ముమ్మిడివరం: నగర పంచాయతీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం సమావేశ మందిరంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పోలమ్మ చెరువు గట్టు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి ఆహ్లాదకరమైన పార్కును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అయినాపురం రోడ్డు ప్రాజెక్టు నుంచి తొలగించి టెండర్ల ద్వారా పిలవాలని ఆర్ అండ్‌బీ అధికారులకు సూచించామన్నారు. మున్సిపల్ శాఖా మంత్రి నారాయణతో మాట్లాడి పంచాయతీ అభివృద్ధికి నిధులు తీసుకొస్తామన్నారు. నగర పంచాయతీ సమావేశానికి తొలిసారిగా విచ్చేసిన బుచ్చిబాబుకు చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. ఆయిల్ ఇండియా కంపెనీ సైట్ నుంచి ఉచితంగా తెచ్చిన గ్రావెల్‌కు రోలింగ్ చేయడం వంటి పనులకు మాత్రమే ఎంబుక్‌లో రికార్డు చేసి కౌన్సిల్ ముందు ఉంచామని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నాసిరకం గ్రావెల్‌ను తీసుకొచ్చి రహదారులు ఎలా వేస్తారని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ ఆరోపించారు. ఈ పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపులో ఎమ్మెల్యే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చైర్మన్ అన్నారు. 9వ వార్డు కౌన్సిలర్లు అడబాల సతీష్‌కుమార్, 17వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్‌లు పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కమిషనర్ వెంకట రామిరెడ్డి, వైస్ చైర్మన్లు రెడ్డి హేమ సుందరి, వేటుకూరి బోసు రాజు, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జీఎస్టీ గ్రీవెన్స్ కమిటీలో చోటు

యానాం: జీఎస్టీ గ్రీవెన్స్ కమిటీలో యానాం వర్తక సంఘానికి స్థానం కల్పించారని సంఘం గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఫెడరేషన్లు, ట్రేడ్ అసోసియేషన్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ తదితర జీఎస్టీ చెల్లింపుదారులందరూ ఈ కమిటీలో ఉన్నారన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా వర్తకుల కోసం జీఎస్టీ సంబంధింత సమస్యలను విన్నవించుకునేందుకు జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ కమిటీ ఏర్పాటుచేశారన్నారు. రిప్రజెంటేటివ్స్ ఫ్రమ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ అసోయేషన్, సంస్థల కేటగిరీలో వర్తక సంఘ గౌరవ అధ్యక్షుడినైన మాజేటి సత్యభాస్కర్ తనను నియమించారన్నారు.

పలువురికి సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి

యానాం: ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్లలో 33 మందికి పదోన్నతులు కల్పించగా యానాం నుంచి జీజీహెచ్‌లో పనిచేస్తున్న అనివిల్ల శ్రీనివాస్‌కు సూపరింటెండెంట్‌గా పదోన్నతినిస్తూ పుదుచ్చేరి సెదారోపేటలోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్‌కు బదిలీ చేశారు.

ఆయన సేవలు అభినందనీయం



వైద్యనాథ్‌శర్మను సత్కరిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్‌శర్మ అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శనివారం రాత్రి జరిగిన కలెక్టరేట్ కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ వైద్యనాథ్ శర్మ పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ వైద్యనాథ్‌శర్మ రెవెన్యూ విభాగంలో రూల్స్ పొజిషన్‌పై పూర్తి అవగాహన పెంచుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. క్షేత్రస్థాయి భూపరిపాలన విధానాలపై ఎంతో అనుభవంతో కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. ఎన్నికల ముందు రెవెన్యూ సిబ్బంది కొందరు బదిలీ కావడంతో మళ్లీ నూతన జిల్లా ఏర్పడిన నాటి సమస్యలు ఉత్పన్నమవుతాయని భావించానన్నారు. అయినా సమర్థ అనుభవం కలిగిన వైద్యనాథ్ శర్మ వంటి వ్యక్తులు కలెక్టరేటుకు బదిలీపై రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయాయన్నారు. అనంతరం వైద్యనాథ్‌శర్మను కలెక్టర్ హిమాన్షుశుక్లా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్, పి.సుబ్రహ్మణ్యం, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కరవు



ఈదరపల్లి హాస్టల్‌లో వాటర్ ట్యాంక్‌లను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురంలోని పలు సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కరవై విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని బీసీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖలకు చెందిన హాస్టళ్లను జిల్లా ఎస్ఎఫ్ఐ బృందం శనివారం పరిశీలించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కె.శంకర్, కె.ప్రణీత్ సాయి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పొలమూరి శ్రీనివాసరావుతో కూడిన బృందం హాస్టళ్లను సందర్శించింది. ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న బీసీ సంక్షేమ బాలికల హాస్టల్, ఈదరపల్లి సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ ఉన్నా అది పనిచేయక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈదరపల్లి హాస్టల్‌లో వాటర్ ట్యాంక్‌లకు కనీసం మూతలు కూడా లేకపోవడాన్ని బృంద సభ్యులు గుర్తించారు. వాటర్ ట్యాంక్‌ల నిండా దోమలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ నాయకుడు శంకర్ తెలిపారు. ఈ హాస్టల్‌లో కనీసం డస్ట్ బిన్‌లు కూడా లేవని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్ఎఫ్ఐ బృంద నాయకులు విజ్ఞప్తి చేశారు.

విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేయాలి



ఉద్యోగ విరమణ చేసిన నరసింహరావు, రామస్వామిలను సత్కరించిన ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా తదితరులు

అమలాపురం టౌన్: పోలీసులు విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తే ఆ సంతృప్తి జీవితాంతం ప్రత్యేకంగా ఉంటుందని జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఐవీకే నరసింహరావు, రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జె.రామస్వామిల ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం రాత్రి జరిగిన వీడ్కోలు సభలో ఎస్పీ శ్రీధర్ మాట్లాడారు. నరసింహరావు, రామస్వామిలు పోలీసు శాఖలో 33 ఏళ్లకు పైగా సుదీర్ఘ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన నరసింహరావు, రామస్వామిలను జిల్లా ఎస్పీ శ్రీధర్ తోపాటు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషాలు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారి

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్లలోని శ్రీవీరేశ్వరస్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన భక్తుడు పులి విజయ నరసింహం రూ.24,666 విరాళంగా సమర్పించారు. శనివారం సదరు మొత్తాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. దాతకు అర్చకులు యనమండ్ర సుబ్బారావు ప్రత్యేక దర్శనం కల్పించి శేష వస్త్రం, స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: మండల కేంద్రం ఐ.పోలవరం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, గుత్తినదీవి, జి.వేమవరం, జి.మూలపొలం, కేసనకుర్రు, తిల్లకుప్ప, ఎదురులంక, గోగులంక, పాత ఇంజరం, మగసానితిప్ప ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

లోక్ అదాలత్‌లో 168 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో మొత్తం 168 కేసులు పరిష్కారమయ్యాయి. రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో ఈ లోక్ అదాలత్ జరిగింది. మొత్తం 168 కేసుల్లో 26 సివిల్ కేసులు, 68 క్రిమినల్ కేసులు, 38 మోటారు యాక్సిడెంట్ కేసులు, 28 బీఎస్ఎన్ఎల్ కేసులు, 8 బ్యాంక్ కేసులు పరిష్కారమయ్యాయి. దాదాపు రూ.3 కోట్లకు పైగా విలువైన కేసులను కక్షిదారులు రాజీ ధోరణిలో పరిష్కరించుకున్నారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, జూనియర్ సివిల్ జడ్జి ఎ.హిమబిందు, అదాలత్ మెంబర్లు, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నార్త్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక



నరసింహ

అమలాపురం రూరల్: వచ్చే నెల 2వ తేదీన విజయనగరంలో జరిగే నార్త్ జోన్ క్రికెట్ పోటీలకు అమలాపురం రూరల్ మండలం సమనసకు చెందిన పదో తరగతి విద్యార్థి మహాదస వెంకట నరసింహ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి నరసింహను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ మనువిహార్, ప్రిన్సిపాల్ దేవి దీక్షిత్, ఉపాధ్యాయులు అభినందించారు.

అబ్బులుకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కంచిపల్లి అబ్బులును ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు శనివారం పరామర్శించి తమ సానుభూతి తెలియజేశారు. వీరితో పాటు జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, వంటెద్దు బాబి, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను తదితరులు అబ్బులను పరామర్శించారు.

బీఎల్‌వోలకు ఎన్నికల పారితోషికం అందించాలి



తహసీల్దార్ మల్లికార్జునరావుకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉప్పలగుప్తం: ఎన్నికల విధులు నిర్వర్తించిన బీఎల్‌వోలకు పారితోషికం అందించాలని పలువురు సచివాలయ ఉద్యోగులు తహసీల్దార్ టి.మల్లికార్జునరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో నిష్పక్షపాతంగా పనిచేశామని, ఫారం ఫామ్ 6, 7, 8లకు సంబంధించి జిరాక్స్ ఖర్చులు సైతం తామే పెట్టుకున్నామన్నారు. తమకు రావాల్సిన పారితోషికం ఎన్నికలు పూర్తయిన తరువాత ఇస్తారని ఆశించినా ప్రయోజనం కనిపించడం లేదన్నారు. సచివాలయ సిబ్బంది బీఎల్‌వోలుగా చేసిన సేవలను గుర్తించి నెల జీతం అదనంగా ఇవ్వాలని కోరారు. తక్షణం అలవెన్సును అందించి ఆదుకోవాలని వారు కోరారు.

శిథిల స్థితిలో శ్మశాన వాటిక భవనం



బీటలు వారి పెచ్చులూడిపోతున్న శ్మశాన వాటిక భవనం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు గ్రామ పంచాయతీ శివారు రంగనాయకపురం, గుత్తులవారి పాలెం గ్రామాలకు చెందిన శ్మశాన వాటిక భవనం శిథిల స్థితికి చేరుకుంది. గుత్తులవారి పాలెం గ్రామం ఆత్రేయ ఉప కాలువ గట్టు చెంతన సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ శ్మశాన వాటిక భవనం పునాది భూమిలోకి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. భవనం స్తంభాలు, శ్లాబు బీటలు వారి పెచ్చులుగా ఊడిపడిపోతున్నాయి. భవనం ఎప్పుడు పడిపోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.